సాక్షి బాపట్ల

గురువారం । 22 । ఆగస్టు । 2024



విగ్రహ పునఃప్రతిష్ఠ నేడు

నాదెండ్ల: చిరుమామిళ్ల నడింబజారులో రూ.60 లక్షలతో నూతనంగా నిర్మించిన శ్రీ రామ మందిరంలో విగ్రహ పునః ప్రతిష్ఠ వేడుక గురువారం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



ఘనంగా ఆలయ వార్షికోత్సవం

శావల్యాపురం: కనమర్లపూడిలోని శ్రీ నీలంపాటి అమ్మవారి ఆలయ 4వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. మూల విరాట్‌ను అలంకరించి, పూజలు చేశారు.

నేడు లక్ష్మీగణపతి హోమం



దాచేపల్లి : స్థానిక శ్రీ వీర్ల అంకమ్మతల్లి దేవాలయంలో గురువారం లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యుడు యలమల నరేష్ తెలిపారు. దీంతో పాటు చండీ హోమం కూడా జరుగుతుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

న్యూస్‌రీల్

చేపలకు వల వేస్తే చిక్కిన కొండచిలువ



ప్రత్తిపాడు: చేపలకు వల వేస్తే అందులో కొండచిలువ చిక్కింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడుకు చెందిన చెర్లోపల్లి శ్రీనివాస్ స్థానిక రామవాగులో చేపలు పట్టేందుకు బుధవారం ఉదయం వల విసిరారు. అందులో ఓ చేపతో పాటు సుమారు తొమ్మిది అడుగుల కొండచిలువ చిక్కుకుంది. విషయాన్ని స్థానికుల ద్వారా పోలీసులకు తెలియజేశారు. అటవీశాఖ అధికారులకు ఎస్ఐ కె. నాగేంద్ర సమాచారం అందించారు. వారు వచ్చి కొండచిలువను స్వాధీనం చేసుకుని, నడింపాలెం సమీపంలోని అటవీప్రాంతంలో సురక్షితంగా వదిలేశారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ యాజమాన్యాలలోని అన్ని పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరానికి జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కె.ఎం.ఏ.హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు, వసతి లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ, కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3.50 లక్షలు లోపు ఉన్న విద్యార్థులు అర్హులని వివరించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు సెప్టెంబర్ 6వ తేదీ, రుసుం చెల్లించేందుకు సెప్టెంబర్ 10వ తేదీ తుది గడువు అని తెలిపారు. పరీక్ష డిసెంబర్ 8వ తేదీన నిర్వహిస్తారన్నారు. రుసుం రూ.100లు, ఎస్సీ, ఎస్టీలకు రూ.50 ఆన్‌లైన్‌లో ఎస్‌బీఐ లింక్ ద్వారా మాత్రమే చెల్లించాలని తెలిపారు.

వైభవంగా శివుడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



మంగళగిరి : పట్టణంలో వేంచేసిన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద శివుడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. తొలుత ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. విగ్రహాన్ని దాతలు మాదల వేంకటేశ్వరరావు, అంజమ్మ దంపతులు ఏర్పాటు చేశారు. మాదల గోపికృష్ణ, భోగి కోటేశ్వరరావు, తులిమిల్లి రామకృష్ణ, నిరీష, వెంకటకృష్ణ, రమ్య, మాధవి పాల్గొన్నారు.

సత్తెనపల్లి-విజయవాడ రూట్‌లో కొత్త ఆర్టీసీ బస్సు



సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సత్తెనపల్లి-విజయవాడ రూట్‌కు నూతన ఆర్టీసీ బస్సును స్థానిక శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ప్రారంభించారు. అనంతరం నాయకులతో కలిసి బస్సు ఎక్కి మొదటి టికెట్ కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అటవీ జాతి మొక్కలతో అదనపు ఆదాయం

సత్తెనపల్లి: వ్యవసాయ భూమిలో అటవీ జాతి మొక్కలు నాటితే అదనపు ఆదాయం లభిస్తుందని టీఓఎఫ్ఏ ప్రోగ్రాం రాష్ట్ర అసోసియేట్ మారపల్లి ప్రణీత్ వర్మ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం బృగుబండ గ్రామంలో అటవీయేతర ప్రాంతంలో చెట్ల పెంపకంపై రైతులకు నిర్వహించిన శిక్షణ సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులకు అగ్రో ఫారెస్ట్ మీద అవగాహన, శిక్షణ నిర్వహించారు. అటవీ జాతి మొక్కలను వ్యవసాయ భూముల్లో నాటితే వాటి వల్ల వచ్చే ఉపయోగాలు, అదనపు ఆదాయం గురించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ వీఏఏ జీవనజ్యోతి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సాగు ఆశలు ఆవిరి..!

అన్నదాతపై ప్రకృతి కన్నెర్ర చేసింది. భానుడు భగభగ అంటుండటంతో నారుమళ్లు, వరి నాట్లు ఎండిపోతున్నాయి. ఇటు వరుణుడి కటాక్షం లేక, అటు కాలువ నీరు పొలం దరిచేరక దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు ఉన్నారు. అప్పులు చేసి డీజిల్ ఇంజిన్లతో నీరు పెడుతున్నా ప్రయోజనం ఎంతవరకో తెలియక ఆందోళన చెందుతున్నారు. మరికొందరు బీడుగా పొలాలను వదిలేస్తున్నారు.

- ఎండ దెబ్బకు మాడిపోతున్న నారుమళ్లు, వరి పైర్లు
- అన్నదాతలకు ఆదిలోనే తప్పని నీటి కష్టాలు
- వానలు కురవక, కాలువ నీరు అందక రైతుల అవస్థలు



వల్లువారిపాలెంలో డీజిల్ ఇంజిన్‌తో పొలానికి నీరు పెడుతున్న దృశ్యం



మచ్చావారిపాలెంలో ఎండిపోతున్న వరి పైరు

బాపట్ల టౌన్: జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సాగులో వరి సాధారణ విస్తీర్ణం 1,03,789.60 హెకార్లు ఉండగా.. ఇప్పటివరకు కేవలం 40,707 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. ఇందులో వెద పద్ధతిలో 30,694, సాధారణంగా 6,234, బెంగాలీ నాట్లు 3,779 హెక్టార్లలో వేశారు. పది రోజులుగా తీవ్రమైన ఎండలు, వరుణుడు మొహం చాటేయడంతో వెద పద్ధతిలో వేసిన పైర్లు మొక్క దశలోనే మాడిపోతున్నాయి. నాట్లు వేసిన పొలాలు కూడా నీరు లేక ఎండుతున్నాయి. నీటి కష్టాలు సహజంగా అక్టోబర్ నెలలో పైర్లు బిర్రుపొట్ట దశలో ఉన్నప్పుడు తలెత్తేవి. ఒకటి, రెండు తడులు అందిస్తే పైర్లు పూర్తిగా ఈని నవంబర్, డిసెంబర్ మాసాల్లో కోతకు వచ్చేవి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఆదిలోనే నీటి కష్టాలు మొదలయ్యాయి. డీజిల్ ఇంజిన్లపై ఆధారపడాల్సి వస్తోంది. తీర ప్రాంతాల్లోని రైతులు సాగుపై ఆసక్తి చూపడం లేదు. కొన్ని పొలాలు బీడు భూములుగానే వదిలారు. బాపట్ల జిల్లాలో ఏటా నార్లు పోసుకొని నాట్లు వేసుకునేందుకే రైతులు ఆసక్తి చూపేవారు. ముఖ్యంగా తీరప్రాంతాల్లోని రైతులు జూలై చివరి వారంలో నారుమళ్లు సిద్ధం చేసుకొని ఆగస్టు చివరి వారంలో నాట్లు వేసేందుకు సిద్ధమయ్యేవారు. అప్పటికి వర్షాలు పడటం, కాలువల ద్వారా నీరు వస్తుండటంతో సాగు నీటి కష్టాలు ఉండేవి కాదు. ఈ ఏడాది జూలై మాసంలో వర్షాలు కురవడంతో ఆశగా వెద పద్ధతిలో సాగు చేశారు. ప్రస్తుతం మొలకలు వచ్చినా భూమిలో తేమ లేకపోవడం, భానుడి భగభగలతో మొక్కలు మాడిపోతున్నాయి. ఇప్పటికే జిల్లాలో 30,694 హెక్టార్లలో వరి పైర్లు సాగు చేశారు. ప్రస్తుతం అవి చాలావరకు ఎండిపోతున్నాయి. వెద పద్ధతిలో ఇప్పటికే ఎకరాకు రూ. 10 వేల వరకు ఖర్చు చేశారు. ఎండిపోతున్న పైర్లను చూసి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో వరి సాగు విస్తీర్ణం ఇలా..

సబ్ డివిజన్	సాధారణ విస్తీర్ణం	వెద పద్ధతిలో..	నాట్లు (హెక్టార్లలో)
అద్దంకి	823.40	--	13
బాపట్ల	41,479.60	15,212	6,697
చీరాల	1,420	--	--
మార్టూరు	1,751	--	65
పర్చూరు	7,097.80	194	04
రేపల్లె	51,216.80	15,288	3,234
మొత్తం	1,03,789.60	30,694	10,013

ఖర్చు పెట్టినా ప్రయోజనం లేదు



న్యూ ముత్తాయపాలెం చానల్ పరిధిలో కాలువ పక్కనే రెండున్నర ఎకరాల పొలం ఉంది. 20 ఏళ్ల సాగు అనుభవంలో నీటి ఇబ్బంది ఇంతగా రాలేదు. డీజిల్ ఇంజిన్‌తో నీరు పెట్టడానికి ఇప్పటికే రూ. 7,500 ఖర్చు అయింది. కాలువ నీరు రాక పోసిన నారు ఏతకు రాలేదు. దీంతో రూ.14,400 పెట్టి నారు కొన్నా. నాటుకు రూ. 8,750 అయింది. కాలువ నీరు లేక, వర్షాలు కురవక ఈ మొక్కలు కూడా ఎండిపోతున్నాయి.

– నక్కల శ్రీనివాసరావు, రైతు, వల్లువారిపాలెం

అప్పులు తెచ్చి మరీ పనులు



నాకు న్యూ ముత్తాయపాలెం చానల్ పరిధిలో 2 ఎకరాలు పొలం ఉంది. ఏటా ఆగస్టులో కాలువ నీటితో నాట్లు వేసువాళ్లం. ఈసారి నీరు రాకపోవడం, వచ్చిన కొద్ది నీటిని కూడా బ్రాంచ్ కెనాల్ దగ్గర పిన్నిబోయినవారిపాలెం రైతులు మళ్లించడంతో సమస్య వచ్చింది. ఆయిల్ ఇంజిన్‌తో ఎకరం తడపాలంటే 10 గంటలు పడుతోంది. దీనికి రూ. 5 వేలు అవుతోంది. పొలాలు బీడుగా వదిలేయటం ఇష్టం లేక అప్పులు తెచ్చి మరీ సాగు చేస్తున్నాం.

– కాటూరి వెంకటనారాయణ, గులాంహుస్సేన్‌తోట

కాలువలకు నీరు విడుదల చేస్తున్నాం

జిల్లాలోని రైతులకు సాగు నీటిని అందించే కొమ్మమూరు కాలువ సామర్థ్యం 3,300 క్యూసెక్కులు. ప్రస్తుతం 2,890 క్యూసెక్కులు రైతులకు అందిస్తున్నాం. బాపట్ల ప్రాంతంలోని రైతులకు సాగునీరు అందించే పీటీ చానల్ సామర్థ్యం 190 క్యూసెక్కులకుగాను 120 క్యూసెక్కులు ప్రస్తుతం ఇస్తున్నాం. ఎండ తీవ్రత వల్ల పొలాలకు పెట్టిన నీరు వెంటనే ఆవిరి అవుతోంది. దీంతో రైతులకు నీటి ఎద్దడి సమస్య తలెత్తింది. వర్షాలు పడే వరకు సమస్య ఇలానే ఉంటుంది.

– సీహెచ్ రామ్మూర్తి, ఇరిగేషన్ డీఈఈ, బాపట్ల

వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడిపై దాడి

చీరాల: చీరాల రూరల్ మండలం పిట్టువారిపాలెంలో టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. కొద్దిరోజుల క్రితం ఫ్లెక్సీల ఏర్పాటు విషయంలో ఇరు పార్టీల మధ్య వివాదం చోటుచేసుకుంది. మంగళవారం సాయంత్రం గ్రామంలోని గృహ ప్రవేశ వేడుకల్లో ఉన్న వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు పిట్టు పోలయ్య ట్రాక్టర్ రివర్స్ చేస్తుండగా టీడీపీ సానుభూతిపరుడు పిట్టు బాలకృష్ణ స్థలంలోకి వెళ్లింది. దీంతో తన స్థలంలోకి ట్రాక్టర్ ఎందుకు వచ్చిందంటూ బాలకృష్ణ ఘర్షణకు దిగడంతోపాటు పోలయ్యపై దాడి చేశారు. ఈ విషయం గ్రామంలో ఇరువర్గాలు, బంధువుల మధ్య వివాదాన్ని రాజేసింది. బుధవారం ఉదయం 6.30 గంటల సమయంలో మళ్లీ ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. కర్రలు, రాళ్లతో పరస్పరం దాడి చేసుకున్నారు. గాయాలపాలైన ఇరుపార్టీల కార్యకర్తలు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందారు. అనంతరం ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. పిట్టు పోలయ్య, విఘ్నేశ్వరరావు, శ్రీను, వెంకన్నలు తమపై దాడి చేసి గాయపరిచారని టీడీపీ సానుభూతిపరుడు పిట్టు బాలకృష్ణ ఫిర్యాదు చేశారు. పిట్టు బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, వెంకట్రావు, రాంబాబు, శ్రీనులపై వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు పిట్టు పోలయ్య కూడా ఫిర్యాదు చేశారు. ఎస్సై శివకుమార్ కేసులు నమోదు చేశారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5,000, గరిష్ట ధర రూ.7,000, మోడల్ ధర రూ.6,000 వరకు పలికింది.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 8012 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 340, బ్యాంక్ కెనాల్‌కు 1889, తూర్పు కెనాల్‌కు 770, పశ్చిమ కెనాల్‌కు 240, నిజాంపట్నం కాలువకు 480, కొమ్మమూరు కాలువకు 3260 క్యూసెక్కులు విడుదల చేశారు.

జైన ధర్మం.. ధన్య వరం

- ధర్మవరం సమీపంలోని కొండపై లభించిన ఆధారాలు
- బసతుల గుర్తింపుతో జైనం విలసిల్లిన ప్రాంతంగా నిర్ధారణ
- గ్రామ దేవాలయంలో రెండు జైన తీర్థంకరుల విగ్రహాలు
- 24 మంది విగ్రహాలు చెక్కిన ఏక శిల్పం కూడా లభ్యం
- క్రీ.శ. రెండో శతాబ్దానికి చెందినవిగా పురావస్తు శాఖ పరిశోధనలో వెల్లడి



దేవాలయాల్లో బయటపడిన తీర్థంకరుల విగ్రహాలు

అద్దంకి: బాపట్ల జిల్లాలోని అద్దంకి మండలం పరిధిలో ఉన్న ధర్మవరం గ్రామంలో జైనం విలసిల్లినట్లు చారిత్రక ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి. విజయవాడ సమీపంలోని మొగల్రాజపురం, ఉండవల్లి తరువాత ఈ గ్రామమే ఆ స్థాయిలో పేరొందినట్లు తెలిసింది. ఈ గ్రామ సమీపంలోని కొండపై లభించిన ఆధారాలను బట్టి చూస్తే క్రీస్తు శకం రెండో శతాబ్ద ప్రాంతంలో జైన ధర్మం ఇక్కడ ప్రాచుర్యం పొందింది. కొండపై పశువులు, మేకల కాపరులు పెద్ద సైజు ఇటుకల బావిని పోలిన గోతులను గమనించి శాసన పరిశోధకుడు జ్యోతి చంద్రమౌళికి తెలియజేయడంతో అసలు చరిత్ర వెలుగుచూసింది. పురావస్తు శాఖ చేపట్టిన పరిశోధనల్లో కూడా ఈ విషయాలు తెలిశాయి.

జీవన శైలి ఇలా...


జైనులు నదీ పరివాహక, కొండ ప్రాంతాల్లో ఆవాసాలు ఏర్పాటు చేసుకుని జీవించేవారు. వారంతా అక్కడి మట్టిని కాల్చి ఇటుకలను తయారు చేసుకుని బసతుల (ఆవాసాల)ను నిర్మించుకునేవారు. వీరిలో దిగంబరులు, శ్వేతాంబరులు, యాపనీలు అనే మూడు శాఖలకు చెందిన వారున్నారు. శ్వేతాంబరులు వస్త్రాలు ధరించినప్పటికీ దిగంబరుల సూత్రాలను పాటిస్తూ ఉంటారు. వీరంతా అహింసావాదులు, శాకాహారులు. ప్రకృతినే ఆరాధించేవారు. తాము నివసించే పరిసరాల్లో లభించే మట్టిని పెద్ద ఇటుకలుగా మార్చి తయారు చేసుకున్న బసతుల్లో నివసించేవారు. పండ్లు, ఇతరత్రా తింటూ జీవనం సాగించేవారు. వీరిలో గొప్ప వారిని తీర్థంకరులుగా పిలుస్తుంటారు. వారిలో వర్ధమాన మహావీర తీర్థంకరుడు పేరు పొందారు. ఆయన విగ్రహం కర్ణాటక రాష్ట్రంలోని శ్రావణ బెల్గోలాలో ఉంది. మొత్తం 24 మంది తీర్థంకరులు ఉన్నారు.

కొండపైన లభించిన ఆధారాలు ఇవే..

ధర్మవరం గ్రామ సమీపంలోని వెంకటేశ్వర స్వామి తిప్పపై క్రీస్తు శకం రెండో శతాబ్ద సమయంలో జైనులు నివశించినట్లు ఆధారాలను బట్టి తెలుస్తోంది. 500 అడుగులకు పైగా ఎత్తు కలిగిన ఈ తిప్పపై వారు బసతులు నిర్మించుకున్నారు. వాటి ఆనవాళ్లు ఇప్పటికీ ఉన్నాయి. ఈ ఇటుకలు 18 అంగుళాల పొడవు, 9 అంగుళాల వెడల్పు, 4 అంగుళాల ఎత్తు కలిగి దృఢంగా ఉంటాయి. బసతులు నాలుగు ద్వారాలు కలిగి వంద మీటర్ల వైశాల్యం కలిగి ఉండేవి. ఈ బసతుల మధ్యలో దారి ఉంటుంది. ప్రస్తుతం నిర్మాణాలు శిథిలమైపోగా, వాటి ఆనవాళ్లు మాత్రమే లభించాయి. ఈ బసతులకు కొద్ది దూరంలో కొంచెం లోతుతో కూడిన బావిని పోలిన ప్రార్థనా ప్రదేశాలు ఉన్నాయి.

గ్రామ దేవాలయంలోనూ..

ధర్మవరం గ్రామంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలోని వినాయకుడి గుడి ముందు 23వ తీర్థంకరుడైన పార్శ్వనాథుని విగ్రహం బయటపడింది. మల్లికార్జున స్వామి ఆలయం ప్రాంతంలో వర్ధమాన మహావీరుడి విగ్రహం వెలుగు చూసింది. 24 మంది తీర్థంకరుల విగ్రహాలను ఒకే రాతిపై చెక్కిన శిల్పం లభ్యం అయింది.



24 మంది తీర్థంకరుల విగ్రహాలు కలిగిన శిల్పం

ఇది ప్రస్తుతం హైదరాబాద్‌లోని పురావస్తు శాఖ మ్యూజియంలో భద్రపరిచారు. క్రీ.శ. 945 ప్రాంతంలో 24వ వర్ధమాన తీర్థంకరుడు ఎంతో పేరు పొందారు. ఆ సమయంలో ఈ ప్రదేశాన్ని పరిపాలించే అమ్మిరాజు (చాణక్య ప్రభువు) తన జైన గురువు పేరిట ఒక ఆలయాన్ని కట్టించినట్లుగా తామ్ర శాసనం లభ్యం అయింది. ఇలా గ్రామ కొండపైన లభించిన ఆనవాళ్లను బట్టి ఈ గ్రామం పురాతనమైనదిగా, జైన ధర్మం విలసిల్లిన ప్రదేశంగా పరిశోధనల్లో నిర్ధారణ అయింది.

తమ్ముళ్లూ.. ఇక దున్నుకోండి!

- మంత్రి ఒత్తిడితో టీడీపీ వారికి దేవదాయ భూముల కౌలు
- రెండేళ్ల గడువు ఉన్నా పాట పాడుకున్న వారు పక్కకే
- ఆలయ భూముల్లో సేద్యానికి పచ్చ ముఠాలు సిద్ధం
- కోర్టు ఉత్తర్వులిచ్చినా బేఖాతర్ అంటున్న ఎల్లో గ్యాంగ్

అక్రమాల సేద్యానికి అడ్డగోలు దారిలో టీడీపీ సిద్ధమైంది. దేవుళ్ల భూమిపై గురిపెట్టిన తమ్ముళ్లకు అమాత్యుల వారి అండదండలు లభించాయి. ఇంకేం.. తమ్ముళ్లూ ఇక దున్నుకోండి.. అంటూ అభయమిచ్చారు. దీనికి అధికారులూ వత్తాసు పలికారు. అడ్డగోలు సిరిసంపదలకు అలవాటుపడిన పచ్చ ముఠాలు ఇప్పుడు ఆలయాలపై చేస్తున్న దాడికి నిదర్శనంగా నిలుస్తోందీ పర్వం. అటు అమ్మవారి భూమి.. ఇటు చెన్నకేశవుడి భూమి.. గడువు ముగియకముందే కౌలుదారులను పక్కకు నెట్టి మరీ గ'లీజు' బుద్ధి చాటింది టీడీపీ!



ఏడు ఎకరాల మాగాణీ విషయంలోనూ...

సాక్షి ప్రతినిధి, బాపట్ల: నగరం మండలం సిరిపూడికి చెందిన మేడిబోయిన సురేష్‌రెడ్డి ఇదే గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సిరిపూడి అమ్మవారి దేవస్థానానికి చెందిన సర్వేనంబర్ 128 'ఏ'లోని 12.01 ఎకరాల భూమిని వేలంపాట ద్వారా కౌలుకు తీసుకున్నారు. ఇందుకు ఏడాదికి రూ. 2.67 లక్షలు చెల్లిస్తున్నారు. నీటి సౌకర్యం లేని సదరు మెట్ట భూములలో సొంతంగా బోర్లు వేసి, విద్యుత్ సౌకర్యం కల్పించుకున్నారు. దేవదాయ శాఖ నిబంధనల ప్రకారం మూడేళ్లకొకసారి మాత్రమే ఆలయాల భూములను వేలం పాట ద్వారా కౌలుకు ఇస్తారు. ఆ మేరకు 2023 జూన్ 26న సురేష్‌రెడ్డికి భూములను కౌలుకు కేటాయించారు. ఇంకా లీజు గడువు రెండేళ్లు ఉంది. రెండు నెలల క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి అనగాని సత్యప్రసాద్ అనుచరులు సదరు భూములపై కన్నేశారు. వెంటనే దౌర్జన్యంగా స్వాధీనం చేసుకున్నారు. సేద్యం చేసేందుకు కూడా సిద్ధమయ్యారు. నిబంధనలకు విరుద్ధంగా వేరొకరికి భూములు ఎలా కేటాయిస్తారని దేవదాయ శాఖ అధికారులను సురేష్‌రెడ్డి నిలదీశారు. ఇది అన్యాయమంటూ జూలై నెలలో హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం స్టే ఇచ్చినా టీడీపీ నేతలు ఖాతరు చేయక సాగుకు సిద్ధమయ్యారు.

సిరిపూడి అమ్మవారి దేవస్థానం పరిధిలో ఉన్న దాదాపు ఏడు ఎకరాల మాగాణీ భూముల విషయంలోనూ ఇదే తంతు కొనసాగిందని సమాచారం. గడువు ముగియకుండానే కౌలుదారులను తప్పించి దేవదాయశాఖ అధికారులు యథేచ్ఛగా టీడీపీ నేతలకు భూములను కౌలుకు కట్టబెట్టినట్లు తెలుస్తోంది. మంత్రి అనుచరులు ఏది చెబితే అదే అన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెన్నకేశవుడి మాణ్యం భూములనూ వదల్లేదు..

ఇదే గ్రామంలో ఉన్న చెన్నకేశవస్వామి దేవస్థానం పరిధిలోని దాదాపు 33 ఎకరాల మాణ్యం భూములను కూడా పచ్చ ముఠాలు వదల్లేదు. మంత్రి ఒత్తిడితో ప్రస్తుతం ఉన్న కౌలుదారులకు కాకుండా టీడీపీ నేతలకు అధికారులు ఆ భూములు కట్టబెట్టినట్లు సమాచారం. వేలం పాటలు నిర్వహించకుండానే ఇలా చేయడం చట్టవిరుద్ధం. పైగా వేలం పాట విషయం అందరికీ తెలుపకుండా పచ్చ నేతలు చెప్పిన వారి పేర్లు రాసి నిర్వహించినట్లుగా పేర్కొంటూ తప్పుడు రికార్డులు సృష్టించినట్లు తెలుస్తోంది. పైగా సిరిపూడి దేవుడి మాణ్యం భూములను రూ. వెయ్యి ఎక్కువ ఇచ్చినవారికి కేటాయించినట్లు అధికారులు ప్రచారం కూడా చేస్తున్నారు. మంత్రి ఒత్తిడితోనే ఈ తతంగం సాగినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది.

అన్యాయంగా కౌలు రద్దు

చాలా ఏళ్ల నుంచి సిరిపూడి అమ్మవారి దేవస్థానానికి చెందిన 12 ఎకరాల భూములను కౌలుకు చేసుకుంటున్నాం. రూ. 6 లక్షలకుపైగా వెచ్చించి 20 బోర్లు వేసి, విద్యుత్తు వసతి కల్పించాం. భూములను అభివృద్ధి చేశాం. గత సంవత్సరం జూన్ నెలలో కౌలుకు ఇచ్చారు. ఇంకా రెండేళ్లపాటు అగ్రిమెంట్ ఉంది. టీడీపీ నేతలు దౌర్జన్యంగా ఆక్రమించారు. అధికారులు స్పందించకపోవడంతో హైకోర్టుకు వెళ్తే స్టే వచ్చింది. అయినా యంత్రాంగం దీనిపై స్పందించడం లేదు.

– మేడిబోయిన సురేష్‌రెడ్డి, సిరిపూడి

పల్స్ సర్వేను వేగవంతం చేయాలి

జిల్లా పంచాయతీ అధికారి రవి కుమార్



భట్టిప్రోలు: గ్రామాల్లో రక్షిత మంచినీటి సరఫరా పథకాల కింద వ్యక్తిగత, పబ్లిక్ కుళాయిలకు సంబంధించిన (ఆర్‌డబ్ల్యూఎస్) పల్స్ సర్వేను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ కోరారు. బుధవారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది కృషితో భట్టిప్రోలు మండలంలో 85 శాతం పూర్తి చేయడం అభినందనీయమని అన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్ ఫేజ్–2 కింద ప్రస్తుతం ఓడీఎఫ్ ప్లస్‌గా అనేక రాష్ట్రాలు అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్నాయని తెలిపారు. ఈ సర్వే చేసేందుకు గాను ప్రభుత్వం ఏపీ ఓడీఎఫ్ సర్వే 2024కు అనుగుణంగా స్వచ్ఛ ఆంధ్ర అనే మొబైల్ అప్లికేషన్‌ను రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ గ్రామ సభలు, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు, ఓడీఎఫ్ సర్వే తదితర అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, ఈఓపీఆర్డీ టి.ఊహారాణి పాల్గొన్నారు. అంతకుముందు ఐలవరం సచివాలయం–1ను సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

గుంటూరు పశ్చిమ డీఎస్పీగా జయరాంప్రసాద్

నగరంపాలెం: గుంటూరు పశ్చిమ డీఎస్పీగా బీఎం జయరాంప్రసాద్ రానున్నారు. ప్రభుత్వం మంగళవారం నిర్వహించిన బదిలీల్లో భాగంగా విశాఖపట్నం సిటీ తూర్పు ఏసీపీగా ఉన్న జయరాంప్రసాద్ ఇక్కడకు రానున్నారు. గతంలో ఇక్కడ డీఎస్పీగా విధులు నిర్వర్తించిన కేవీ మహేష్‌ను హిందూపూర్‌కు బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న డీఎస్పీ కె.నాగేశ్వరరావును పల్నాడు జిల్లా నరసరావుపేట సబ్ డివిజన్‌కు బదిలీ చేశారు.

క్లుప్తంగా

పాస్టర్‌పై దాడి ఘటన.. ఎట్టకేలకు కేసు నమోదు

కొల్లూరు: స్థలం వివాదంలో పాస్టర్‌పై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటనపై ఎట్టకేలకు కొల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... మోక జయరాజు దోనేపూడిలోని స్థలంలో ఇల్లు, చర్చి నిర్మించుకొని ప్రార్థనలు చేస్తూ కుటుంబంతో ఉంటున్నారు. ఆయన స్థలం పక్కనే హార్వెస్టు ఇండియా మినిస్ట్రీస్ డైరెక్టర్ కత్తెర సురేష్‌కు చెందిన స్థలం ఉంది. పాస్టర్ ఉంటున్న స్థలం కూడా తమదేనని, ఖాళీ చేయాలని కొంత కాలంగా ఆయనపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ నెల 16న ఈ విషయంపై చర్చించడానికి తెనాలికి చెందిన సుద్దపల్లి నాగరాజు, మరి కొంతమంది వచ్చి పాస్టర్‌పై దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కొల్లూరు ఎస్‌ఐ జి. ఏడుకొండలు నిందితులపై మంగళవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు

చేబ్రోలు: విద్యార్థిని అదృశ్యంపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు అందించిన వివరాలు.. మండలంలోని నారాకోడూరుకు చెందిన అమ్మాయి స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. విద్యార్థిని మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఇంటి నుంచి వెళ్లినట్లు అమ్మమ్మ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు మాయ మాటలు చెప్పి తీసుకువెళ్లినట్లు బంధువులు అనుమానిస్తున్నారు. బాలిక అమ్మమ్మ జి.ముత్తేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్‌ఐ పి.వెంకటకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒడిశా కార్మికుడు మృతి

నాదెండ్ల: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒడిశా రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు మృతి చెందాడు. యడ్లపాడు మండలంలోని బోయపాలెం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. ఎస్సై వి. బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు యడ్లపాడు ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్‌లో కార్మికుడిగా పనిచేస్తున్న సుదర్శన్‌జైన్ (47) పనుల నిమిత్తం బోయపాలెం వెళ్ళి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనటంతో మృతి చెందాడు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ వివాదానికి రాజకీయ రంగు

- కోర్టు దావాలను దాచి లోకేష్ ప్రజా దర్బారులో ఫిర్యాదు
- గతంలోనే వివాదాన్ని విచారించిన పోలీసులు


పిల్లలతో పిల్లి అబ్రహాం కుమారుడు సుధాకర్, కృపాజ్యోతి దంపతులు

తెనాలి: కుటుంబ సభ్యుల మధ్య ఉన్న ఆస్తి వివాదాన్ని రాజకీయ కక్ష సాధింపునకు వాడుతున్నారు. కోర్టులో ఉన్న దావాలకూ అందుకు మినహాయింపు లేదన్నట్టుగా ఉంది. మంత్రి నారా లోకేష్ నిర్వహించిన ప్రజాదర్బారులో గుంటూరు జిల్లా తెనాలికి చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి పిల్లి అబ్రహాం, అతడి కుమార్తె సుధారాణి 'మెడపై కత్తిపెట్టి ఆస్తిని కబ్జా చేశారు' అంటూ ఇచ్చిన ఫిర్యాదు ప్రత్యక్ష నిదర్శమని సుధారాణి సోదరుడు పిల్లి సుధాకర్, భార్య కృపాజ్యోతి ఆరోపించారు. స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక కార్యాలయంలో బుధవారం రాత్రి విలేకరుల సమావేశంలో కృపాజ్యోతి మాట్లాడుతూ సుధారాణి తనకు ఇష్టం లేకుండా వివాహం చేసుకున్న కారణంగా పిల్లి అబ్రహాం తన మూడు ఇళ్లు, 60 సెంట్ల పొలాన్ని కొడుకు సుధాకర్ పేరిట వీలునామా రాశారు. ఆ ఆస్తి ఉందన్న కారణంగానే తన తల్లిదండ్రులు రూ.5 లక్షల నగదు, వాహనం, ఉంగరం కట్నంగా ఇచ్చిన సుధాకర్‌తో తన పెళ్లి జరిపించారని కృపాజ్యోతి చెప్పారు. ఇళ్లపై వస్తున్న అద్దెలో సగం, చెప్పుల షాపులో పనిచేస్తూ వస్తున్న జీతంతో ఇద్దరు పిల్లలు, భర్త, తాను జీవిస్తున్నట్టు తెలిపారు. కొంత కాలం క్రితం ఆస్తి మొత్తం తనదేనని సుధారాణి, ఇల్లు ఖాళీ చేయాలని చెబుతూ వచ్చినట్టు వివరించారు. మరోవైపు సుధారాణి భర్త కోటేశ్వరరావు, తనను భర్తను వదిలేసి, హైదరాబాద్ రమ్మని ప్రలోబపెట్టినా తాను వినలేదన్నారు. దీంతో ఇల్లు ఖాళీ చేయమని ఒత్తిడి చేయటంతో, తాము పోలీసులను ఆశ్రయించినట్టు చెప్పారు. అప్పటి టూటౌన్ సీఐ వెంకట్రావు ఇద్దరినీ విచారించి, సుధారాణిని మందలించి, సోదరుడికి కూడా హక్కు ఉందని చెప్పారని తెలిపారు. సీఐ మాట కూడా వినకుండా ఆమె కోర్టులో దావా వేసిందన్నారు. దీనిపై తాము కూడా కోర్టును ఆశ్రయించినట్టు తెలిపారు. 2022 నుంచి ఓఎస్ 951/22, 692/23, 694/23, 474/23, సీసీ 280/23, 119/23 దావాలు కోర్టులో నడుస్తున్నాయని వివరించారు. వాస్తవాల ఇలా ఉంటే వారి మెడపై కత్తిపెట్టి కబ్జా చేశామనటం అవాస్తమని వివరించారు.

కౌలుకు ఇచ్చింది అబ్రహామే...



పిల్లి అబ్రహాంకు ఉన్న 60 సెంట్ల పొలాన్ని ఎంతోకాలంగా నేను సాగు చేస్తున్నాను. నా ఇంటికొచ్చి పొలం కౌలుకు చేయమని అబ్రహామే ఇచ్చారు. ఒప్పందం ప్రకారం ఏటా కౌలు మొత్తం చెల్లిస్తున్నా. కౌలు చేయటం కబ్జా చేసినట్టు ఎలా అవుతుంది?

– అబ్రహాం సోదరుడు పిల్లి తిరుపతయ్య

మరోసారి అక్రమ కేసు కోసం...



నా భర్త గెడ్డేటి సురేంద్ర ఒకటో వార్డు కౌన్సిలరు. మేమిద్దరం వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లం. మా కుటుంబం 25 ఏళ్లుగా రాజకీయాల్లో ఉంది. ఎన్నికల తర్వాత గొడవల్లో చిలువూరులో జరిగిన హత్య కేసులో నా భర్త పేరు అకారణంగా ఇరికించారు. మళ్లీ ఇప్పుడు ఓ కుటుంబం ఆస్తి వివాదంలో మా భర్త సురేంద్ర, మరిది బాలయ్యపై అక్రమ కేసు బనాయించాలని చూస్తున్నారు. విచారించి తగిన న్యాయం చేయాలి

– గెడ్డేటి ఝాన్సీవాణి, కౌన్సిలరు, తెనాలి

జూడాల కొవ్వొత్తుల ర్యాలీ


గుంటూరు జీజీహెచ్‌లో ధర్నా చేస్తున్న వైద్య విద్యార్థులు


మాట్లాడుతున్న ఘంటసాల శ్రీనివాసరావు, పక్కన ఎన్జీవో నేతలు

గుంటూరు మెడికల్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై లైంగిక దాడిని ఖండిస్తూ గుంటూరు జీజీహెచ్‌లో ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె బుధవారం నాటికి తొమ్మిదో రోజుకు చేరింది. రోగుల ప్రాణాలు కాపాడే వైద్యులకు, వైద్య సిబ్బందికి రక్షణ లేకుండా పోయిందని జూడా నాయకులు వాపోయారు. వైద్యులు, సిబ్బందిపై దాడులు నిలువరించేలా ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. నిందితులను తక్షణమే పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. ఏపీ ఎన్జీవో నేతలు, సీఐటీయూ నేతలు, టీచర్స్ యూనియన్ నేతలు జూడాల సమ్మెకు మద్దతుగా బుధవారం ప్లకార్డులు చేతపట్టుకుని నినాదాలు చేస్తూ గుంటూరు నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట మెడికోలు, జూనియర్ డాక్టర్లు నల్లబ్యాడ్జిలు ధరించి ప్లకార్డులు చేతపట్టుకుని బాధితురాలి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జూడాల సంఘం నేతలు డాక్టర్ పి.దీక్షిత్, డాక్టర్ అన్వర్‌బాషా, డాక్టర్ రవి, డాక్టర్ నిమ్మి, డాక్టర్ చరణ్, డాక్టర్ మనోజ, డాక్టర్ అశ్విని, డాక్టర్ సరిత, హౌస్‌సర్జన్లు బాబి, దీపిక, ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులు మోహన్‌చంద్ర, చరణ్ పాల్గొన్నారు.

జూడాలకు ఏపీఎన్జీవో మద్దతు

గుంటూరు మెడికల్: కోల్‌కతాలో పీజీ విద్యార్థిపై జరిగిన అమానుష ఘటనపై బుధవారం ఏపీ ఎన్జీవో నేతలు నిరసన తెలిపారు. ఈమేరకు గుంటూరు జీజీహెచ్‌లో జూనియర్ డాక్టర్లు చేస్తున్న సమ్మెకు తమ మద్దతు ప్రకటించారు. జీజీహెచ్‌కు చేరుకుని జూడాలు చేస్తున్న నిరసన కార్యక్రమంలో పాల్గొని మద్దతు తెలిపారు. ఏపీ ఎన్జీ జీఓ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ నాగూర్ షరీఫ్ హాజరై అసోసియేషన్ తరఫున సంఘీభావాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి కేఎస్ సుకుమార్, మహిళా సంయుక్త కార్యదర్శి కె.శివజ్యోతి, గుంటూరు నగర అధ్యక్షులు ఎస్‌పీఎస్ సూరి, కార్యదర్శి సిహెచ్ కళ్యాణ్ కుమార్, ఎం శ్రీనివాసరావు, గాబ్రియల్, మహిళా విభాగం చైర్పర్సన్ ఎం.రాధా రాణి, కన్వీనర్ లక్ష్మీ రమ్య తదితర ఉద్యోగులు హాజరై వారి సంఘీభావాన్ని తెలిపారు.

ప్రకృతి సేద్యం విభాగంలో
కదులుతున్న డొంక

- మహిళ ఆత్మహత్యాయత్నం, వేధింపులపై కథనంతో ఉలికిపాటు
- చర్యలు తీసుకుంటామని ఎగ్జిక్యూటివ్ చైర్మన్, డీపీఎం హామీ

మార్టూరు: ప్రకృతి సేద్యం విభాగంలో వేధింపులు, అక్రమాల తీగలాగితే డొంక కదులుతోంది. ప్రకృతి వ్యవసాయ మహిళా సిబ్బంది ఆత్మహత్యాయత్నం విషయంపై ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నాచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) రాష్ట్ర, జిల్లా అధికారులు ఎట్టకేలకు దృష్టి సారించారు. అధికారుల వేధింపులు తాళలేక ఎలుకల మందుతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ ఉదంతంపై బుధవారం ‘సాక్షి’లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. మోడల్ ట్రైనర్‌గా పనిచేస్తున్న పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన సీహెచ్ అప్పారావుపై వచ్చిన వేధింపుల ఆరోపణల గురించి కూడా కథనంలో ప్రస్తావన రావడంతో సంస్థ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ చైర్మన్ విజయ్ కుమార్ స్పందించారు. ఈ కథనాన్ని పరిశీలించిన ఆయన.. విచారించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటానని మీడియాకు సమాచారం ఇచ్చారు. దీంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కొందరి ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందని కిందిస్థాయి సిబ్బంది ఆశగా ఎదురుచూస్తున్నారు. సాక్షి కథనానికి స్పందించిన జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాణిశ్రీ ఫోన్లో మాట్లాడుతూ.. ఘటనపై విచారించి చర్యలు తీసుకుంటానన్నారు.

పోలీస్ ఉన్నతాధికారి ఆరా

మహిళ ఆత్మహత్యాయత్నం గురించి సాక్షి కథనాన్ని చూసిన జిల్లా పోలీస్ బాస్ కింది స్థాయి అధికారులతోపాటు నిఘా విభాగానికి చెందిన వారి నుంచి సైతం వివరాలు రప్పించుకున్నట్లు తెలిసింది. ప్రధానంగా ఈ విభాగంలో మహిళా సిబ్బంది పట్ల లైంగిక వేధింపులు, ప్రమోషన్లను అమ్ముకోవడం, తమకు అనుకూలంగా లేని సిబ్బందిని సాకులతో వేధించటం, దూర ప్రాంతాలకు బదిలీ ద్వారా తొలగించేందుకు యత్నాలు వంటి ఆరోపణలు వెల్లువెత్తాయి. అవినీతి, అరాచకాలకు నిలువెత్తు నిదర్శనంగా మారిన ఈ విభాగంలో ప్రస్తుతం విచారణకు జిల్లా అధికారి వాణిశ్రీ నేతృత్వం వహిస్తే తమకు న్యాయం జరగదని క్షేత్రస్థాయి సిబ్బంది అభిప్రాయ పడుతున్నారు. కలెక్టర్ నిష్పక్షపాత విచారణ జరిపించి న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు. ఈ విభాగానికి సంబంధం లేని అధికారులతో పారదర్శకంగా విచారణ చేయిస్తే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంటుంది.

ఇసుక ట్రాక్టర్ల దెబ్బకు డ్రైనేజీ ధ్వంసం


కొల్లూరు లాక్ సెంటర్ కనకదుర్గమ్మ ఆలయం సమీపంలో రోడ్డుపైకి వస్తున్న మురుగు నీరు

కొల్లూరు: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనాల దెబ్బకు రోడ్లు, డ్రైనేజీలు వంటి ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం అవుతున్నాయి. ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్న వారు ప్రభుత్వ నిఘా బృందాల కంట పడకుండా పలు అంతర్గత మార్గాలలో రాకపోకలు సాగిస్తున్నారు. మితిమీరిన వేగంతో గృహాల మధ్యన ఉన్న పంచాయతీ సీసీ రోడ్లలో అర్ధరాత్రి వేళ అధిక సంఖ్యలో ఇసుక ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తున్నాయి. కొల్లూరు లాకుసెంటర్ సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద డ్రైనేజీ వంతెన బీటలు వారి మురుగు నీరు రోడ్డుపైకి చేరుతోంది. అధికారులు ఇలాంటి ట్రాక్టర్లను నిలువరించడానికి చర్యలు తీసుకోవడంతోపాటు మరమ్మతులు చేపట్టి మురుగు నీరు బయటకు రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

కారు రూపంలో కబళించిన మృత్యువు

విధులకు వెళ్తుండగా వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి

కారంచేడు: విధులకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ప్రభుత్వ ఉద్యోగిని ఎదురుగా వేగంగా వచ్చిన కారు రూపంలో మృత్యువు కబళించింది. చీరాల నగర్‌కు చెందిన నాగార్జున రెడ్డి కారంచేడు మండలంలోని తిమిడెదపాడు గ్రామంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని రోజులుగా సెలవులో ఉన్నారు. బుధవారం విధులకు చీరాల నుంచి దండుబాట రోడ్డులో స్వర్ణ వైపు వెళ్తున్నారు. ఎదురుగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఆయన పక్కన పడిపోయారు. చాలాసేపటి వరకు ఎవరూ గమనించలేదు. స్వర్ణ సచివాలయంలో పనిచేస్తున్న వీఆర్‌ఓ, మరికొంత మంది సిబ్బంది అటుగా వచ్చినప్పుడు చూశారు. శ్వాస ఆడటం లేదని ఆయన వారితో చెప్పినట్లు సమాచారం. 108కి సమాచారం అందించినా సమయానికి రాకపోడంతో వారు ఆటోలో చీరాల ఆసుపత్రికి బాధితుడిని తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందారని వైద్యులు చెప్పారు. నాగార్జున రెడ్డికి భార్య, ఏడాది, రెండేళ్ల వయసున్న ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే ఇన్‌చార్జి ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఈఓపీఆర్డీ రమేష్ బాబు, సచివాలయాల సిబ్బంది ఆసుపత్రికి చేరుకుని నాగార్జున రెడ్డికి నివాళులర్పించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించిన తెలుగు యువతి


జాతీయ జెండాను ఎగురవేస్తున్న అన్నపూర్ణ

తాడేపల్లిరూరల్: రష్యాలోని ఎల్బ్రస్ పర్వతాన్ని మన రాష్ట్రానికి చెందిన తెలుగు యువతి అధిరోహించి నేడు ఇండియాకు తిరిగి రానున్నట్లు బంధువులు బుధవారం తెలిపారు. వివరాలు.. తాడేపల్లి పట్టణ పరిధిలోని కొత్తూరు వైఎస్సార్ సెంటర్‌లో నివాసముంటూ ఉద్యోగ రీత్యా యు.ఎ.ఇ.లో ఉంటున్న కొండపు మహేష్‌రెడ్డి భార్య కొండపు అన్నపూర్ణ ఈనెల 19వ తేదీన ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించి భారత జాతీయ జెండాను ఎగురవేసింది. 14వ తేదీ మొదటి క్యాంప్ ట్రిక్సాల్ 2000 మీటర్లు, రెండవ క్యాంప్‌లో 3857 మీటర్లు, 16,17, 18, 19 తేదీలలో 4,200 మీటర్లు, 19వ తేదీ ఉదయం 7.54లకు మొత్తం 5,642 మీటర్లు(18510 అడుగుల ఎత్తు) పర్వతాన్ని అధిరోహించారు. అన్నపూర్ణ తండ్రి బండారు శ్రీరామచంద్రరావు(లేటు), తల్లి వెంకటేశ్వరమ్మ మొదట నుంచి ఇలా సాహసాలు చేయడంలో, చదువులో ఎంతో ప్రోత్సహించేవారని, ఆ ప్రోత్సాహంతో ఎంఎస్సీ(బయోటెక్) పూర్తి చేయడంతో పాటు బీయిడి పూర్తి చేసి ప్రస్తుతం యు.ఎ.ఇ.లో ఇంటర్నేషనల్ ఇండియన్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. భర్త కండ్రపు మహేష్‌రెడ్డి, చిన్నబాబు బాల వెంకట సిద్దార్థ రెడ్డి ఉన్నప్పటికీ భర్త మహేష్‌రెడ్డి అన్నపూర్ణను ప్రోత్సాహించడంతో నా కుమార్తె అన్నపూర్ణ ఈ సాహసం చేయగలిగిందని తల్లి వెంకటేశ్వరమ్మ తెలిపింది. ఎల్బ్రస్ పర్వతం నిద్రాణమైన అగ్నిపర్వతం ఉన్నప్పటికీ సాహసోపేతంగా ఈ పర్వతాన్ని అధిరోహించడంపై ఆమె స్నేహితులు, బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జేఎన్‌టీయూకే పురస్కారాలలో మెరిసిన వీవీఐటీ


పురస్కారాలు అందుకున్న వారితో కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: జేఎన్టీయూకే ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్సిటీ నిర్వహించిన వేడుకల్లో భాగంగా అనుబంధ కళాశాలలకు అందించిన పురస్కారాలలో వీవీఐటీ కళాశాలకు బెస్ట్ పర్ఫార్మింగ్ ఇనిస్టిట్యూట్, సీనియర్ ప్రిన్సిపాల్ అవార్డుతో పాటు ఉత్తమ అధ్యాపకులుగా అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాసరావు పురస్కారాలు అందుకున్నారని చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు వీవీఐటీలో బుధవారం చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ కాకినాడలో నిర్వహించిన జేఎన్టీయూకే 17వ ఆవిర్భావ దినోత్సవ వేడులలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి చైర్మన్ కె.రామ్మోహనరావు, జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ చేతుల మీదుగా ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు గిరిబాబు, శ్రీనివాసరావు ఈ పురస్కారాలను అందుకున్నారని వివరించారు. అనంతరం పురస్కారాలను పొందిన అధ్యాపకులను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, సెక్రటరీ ఎస్.బదరీ ప్రసాద్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్ అభినందించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయండి

సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్

తెనాలిఅర్బన్: సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ విలేజ్, వార్డు సెక్రెటరీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా పినపాడులోని కమ్యూనిటీ హాల్‌లో బుధవారం సాయంత్రం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు రెండు ఇంక్రిమెంట్‌లు రావాల్సి ఉందని తెలిపారు. వాటిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులపై మాతృశాఖ అజమాయిషీ మాత్రం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తెనాలి పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా షేక్ జానీ బాషా, ఉపాధ్యక్షులుగా ఎస్. అజయ్‌కుమార్, వి.భాస్కర్, కె. నాగరాజు, కార్యదర్శిగా కె. ధర్మేంద్ర సాయి తదితరులు ఎన్నికైనట్లు నాయకులు తెలిపారు.

వ్యాధుల తీవ్రత తగ్గే వరకు క్యాంపులు

పల్నాడు జిల్లా డీఎంహెచ్‌ఓ రవి


సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ బి.రవి

అచ్చంపేట: వ్యాధుల తీవ్రత తగ్గేవరకు గ్రామాలలో వైద్య శిబిరాలను కొనసాగించాలని, అత్యవసర వైద్యసేవలు అవసరమైన వారిని సత్తెనపల్లి, నరసరావుపేట తరలించాలని పల్నాడు డీఎంహెచ్‌ఓ బి.రవి సూచించారు. పలు గ్రామాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను బుధవారం ఆయన సందర్శించారు. పెదపాలెంలో జరుగుతున్న లార్వా సర్వే, ఫీవర్ సర్వేలను పర్యవేక్షించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్రవంతి, వైద్యసిబ్బందికి వ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా నోడల్ అధికారి డాక్టర్ హనుమకుమార్, జిల్లా సీహెచ్‌ఓ హర్షవర్ధన్, మలేరియా సబ్ యూనిట్ అధికారి మొఘల్ సుభానిబేగ్, సీహెచ్‌ఓ శివనాగేశ్వరి, ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకటరావు, సూపర్‌వైజర్ రాధాకృష్ణ, నాగ మల్లేశ్వరరావు, ఎఎల్‌హెచ్‌పీ శివనాగమణి, ఏఎన్ఎం దుర్గ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ వితంతు పెన్షన్ అందాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావతి



సమావేశంలో మాట్లాడుతున్న లీలావతి

నెహ్రూనగర్: అర్హత కలిగి, నిర్దేశిత ధ్రువ పత్రాలు ఉన్న ప్రతి ఒక్కరికీ వితంతు పెన్షన్ అందుతుందని జిల్లా న్యాయ సేవాదికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి తెలిపారు. వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గుంటూరు నగరంలో వితంతు పెన్షన్‌లు మంజూరు కాని అర్జీదారులతో, అధికారులతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన శిబిరం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గుంటూరు నగరంలో సుమారు 6 వందల మంది వితంతు పెన్షన్ మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారు తప్పనిసరిగా తమ భర్త మరణ ధ్రువీకరణ పత్రం కూడా దరఖాస్తు చేయాలన్నారు. అర్జీకి జత చేయకపోతే పెన్షన్ మంజూరు కాదన్నారు. పట్టణ పరిధిలో అయితే నెలకు రూ.12 వేలు, గ్రామీణ ప్రాంతం అయితే నెలకు రూ.10 వేల లోపు ఆదాయం కలిగి ఉండి, దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న వారు, అన్ని ధ్రువ పత్రాలు అర్జీతో పాటు జత చేసి జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో అందించినా సంబంధిత అధికారులకు పంపి పెన్షన్ మంజూరుకు సహకరిస్తామని తెలిపారు. ఒంటరి మహిళలు కూడా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కొన్నిసార్లు రోడ్ ప్రమాదం జరిగిన సమయంలో ఏ వాహనం ద్వారా జరిగిందో కూడా తెలియకపోతే సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి ఎఫ్ఐఆర్ కాపీతో తహసీల్దార్‌కి అర్జీ అందిస్తే తీవ్ర గాయాలు జరిగిన వారికి రెండు నెలల్లో రూ.50 వేలు, మరణం సంభవిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షలు అందించడం జరుగుతుందని వివరించారు.

చిన్నారులకు బైక్‌లు ఇవ్వొద్దు..

తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు ఇష్టానుసారం ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని, ప్రస్తుత చట్టాల ప్రకారం మైనర్లు బైక్‌లు నడిపినా, ప్రమాదాలు చేసినా వారితో పాటు వారి తల్లిదండ్రులకు కూడా శిక్షలు ఉన్నాయని హెచ్చరించారు. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో 15 నుంచి 17 ఏళ్లలోపు బాలికలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని, పోక్సో చట్టం ప్రకారం అటువంటి ఘటనల్లో నిందితులకు కఠిన శిక్షలు పడుతున్నాయని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సెల్ ఫోన్‌లు ఇచ్చి వదిలి వేయకుండా, వారితో ఎక్కువ సమయం గడపాలని సూచించారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థలోని 206 వార్డు సచివాలయాల పరిధిలో ఆరు వందల మంది వితంతు పెన్షన్ దరఖాస్తులు ఉన్నాయని, వాటిలో ఎక్కువ శాతం క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తి చేశామని వివరించారు. వితంతు పెన్షన్ మంజూరుకు తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువ పత్రాలు ఉండాలన్నారు. నగర పరిధిలో ఎవరైనా ఇంకా దరఖాస్తు చేయకుంటే స్థానిక వార్డు సచివాలయంలో అర్జీలు అందించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ డి.వెంకటలక్ష్మి, న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు, నగరపాలక సంస్థ ఉపా సెల్ పీఓ వేణుబాబు పాల్గొన్నారు.

సిలబస్‌పై అవగాహన అవసరం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు


ఎడ్యుకేషన్ సైకాలజీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

తెనాలిఅర్బన్: డీఎస్సీ సిలబస్‌పై అభ్యర్థులు అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. యూటీఎఫ్, జనవిజ్ఞాన వేదికల సంయుక్త ఆధ్వర్యంలో డీఎస్సీపై ఉచిత అవగాహన సదస్సు కొత్తపేటలోని ఎన్జీవో హోంలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. డీఎస్సీ తప్పకుండా జరుగుతుందని చెప్పారు. అనంతరం ఎడ్యుకేషనల్ సైకాలజీ అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. వీటిని ప్రతి పాఠశాలకు పంపుతామని, అవసరమైన వారు దీనిని ఉపయోగించుకోవాలని సూచించారు. సమావేశంలో వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ, ప్రధానోపాధ్యాయులు కుర్రా శ్రీనివాసరావు, షేక్ అహ్మద్ హుస్సేన్, గయాసుద్దౌలా, అంగిరేకుల ఉమామహేశ్వరరావు, కె.సాంబశివరావు, దూబ సందీప్, షేక్ కరిముల్లా, డీవీఆర్ ప్రసాద్, వెలువల సుబ్బారావు పాల్గొన్నారు.